వ్యర్థాల తరలింపునకు టోల్ ఫ్రీ..
ఉపయోగమేదీ?


మక్తమహబూబ్‌పేట్ చెరువు కట్ట పక్కన పారబోసిన వ్యర్థాలు

- ఖాళీ ప్రదేశాల్లో డంపింగ్
- నిరోధంపై దృష్టి సారించని అధికారులు
- చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్


బొల్లారం రోడ్డు పక్కనే చెత్తాచెదారం

మియాపూర్: భవన నిర్మాణ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారబోస్తున్నారు. దీంతో జీహెచ్‌ఎంసీ అధికారులు డంపింగ్‌పై ఫోకస్ పెట్టారు. వ్యర్థాల సేకరణ కోసం టోల్ ఫ్రీ నెంబర్, వాట్సాప్ ద్వారా తెలియజేయాలని అవగాహన కల్పించినా ఫలితం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. డంపింగ్‌ను కట్టడి చేయడంలో సర్కిల్ అధికారులు విఫలమవుతున్నారు. నిర్మాణదారులు, కాంట్రాక్టర్లు ఇష్టమొచ్చినట్లు రోడ్ల పక్కన, ఖాళీ స్థలాలు, చెరువులు, నాలాల పక్కన.. ప్రభుత్వ స్థలాల్లో వ్యర్థాలను పారబోస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యర్థాల తరలింపునకు టోల్ ఫ్రీ నంబర్లు ఉన్నా ఉపయోగం లేకుండా పోయింది. సీసీ కెమెరాల ద్వారా అక్రమ డంపింగ్ గుర్తిస్తామని మొదటిసారి పట్టుబడితే రూ.1000, రెండోసారి పట్టుబడితే రూ.5 వేల రూపాయాల జరిమానా, మూడోసారి పట్టుబడితే కేసులు నమోదు చేస్తామంటున్నా.. చందానగర్ సర్కిల్ పరిధిలోని మియాపూర్, చందానగర్ ప్రాంతాలలో ఎక్కడా అమలు కావడం లేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

> భవన నిర్మాణాలు చేపట్టే డెవలపర్స్, నిర్మాణదారులు వ్యర్థాల తరలింపునకు టోల్ ఫ్రీ నెంబర్ **18001201159 లేదా 9100927073** వాట్సాప్ నంబర్‌లో సంప్రదించాల్సి ఉంటుంది. ట్రక్కులలో నిర్మాణ వ్యర్థాలు సేకరించి రీసైక్లింగ్ ప్లాంట్‌లకు తరలిస్తారు. టన్ను నిర్మాణ వ్యర్థానికి రూ.350 చెల్లించాల్సి ఉంటుంది.

- చందానగర్ సర్కిల్ పరిధిలోని మియాపూర్ ,చందానగర్‌లలో పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డులోని శ్రీనిధి పాఠశాల వెనక ఖాళీ స్థలంలో, మియాపూర్‌లోని బొల్లారం రోడ్డులో మయూరీనగర్, మక్త చెరువుకట్టపై అదే విధంగా దీప్తీశ్రీనగర్‌లోని ధర్మపురి టెంపుల్ రోడ్డు ప్రాంతాలలో భవన నిర్మాణ వ్యర్థాలను పారబోస్తున్నారు.
- నియోజకవర్గంలో నిర్మాణ రంగం అభివృద్ధి చెందుతుండడంతో వ్యర్థాలు కూడా అధిక స్థాయిలో వస్తున్నాయి. వ్యర్థాల అక్రమ డంపింగ్‌పై క్షేత్రస్థాయిలో అధికారులు అవగాహన కల్పించకపోవడం, కొంతమంది సిబ్బంది చూసీచూడనట్లు వదిలేయడంతో అక్రమ డంపింగ్ చేసే వారికి అడ్డుఅదుపు లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు,. - కొంతమంది సిబ్బంది అక్రమంగా డంపింగ్ చేస్తున్న ట్రాక్టర్లు, టిప్పర్లను గుర్తించిన వారితో బేరం కుదుర్చుకొని వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- మరి కొంతమంది కబ్జారాయుళ్ల ప్రభుత్వ భూములను కబ్జా చేసే ప్రయత్నంలో భాగంగా నిర్మాణదారులతో మాట్లాడుకొని వ్యర్థాలను పోయిస్తున్నారు. రాత్రికి రాత్రే చదును చేస్తున్నారని అధికారులు దృష్టి సారించడం లేదని పలువురు అంటున్నారు. దీప్తీశ్రీనగర్, ప్రశాంత్‌నగర్ ప్రాంతాలలోని ఖాళీ ప్రదేశాల్లో వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి.
- జీహెచ్‌ఎంసీ అధికారులు విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపట్టిన క్రమంలో శానిటేషన్ సిబ్బంది నిర్మాణదారులకు కరపత్రాలు అందజేసి టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని బోర్డులు పెట్టినా ప్రస్తుతం ఎక్కడ ఆచరణకు నోచుకోవడం లేదు. అధికారులు స్పందించి అక్రమ డంపింగ్‌ను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.


పీజేఆర్ ఎన్‌క్లేవ్‌లోని శ్రీనిధి పాఠశాల వెనక ప్రభుత్వ స్థలంలో వ్యర్థాలు

జాబ్ ఫెయిర్‌కు విశేష స్పందన

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని వివేకానంద కళాశాలలో బుధవారం డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్ ఆఫ్ తెలంగాణ (డీట్) జాబ్ ఫెయిర్–2023 నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ కొరదాల నరేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో మొత్తం 48 కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారని పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో 1775 మంది ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని హాజరయ్యారని తెలిపారు. అందులో 375 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న కళాశాల నిర్వాహకులు


ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులు

డా.బాలసుబ్రమణియన్, డా.రేణుస్వరూపలకు ఎక్సలెన్స్ అవార్డులు

రాయదుర్గం: డాక్టర్ బీఎస్ బజాజర్ మెమోరియల్ ఎఫ్‌ఏబీఏ ఎక్సలెన్స్ అవార్డు–2023కు డాక్టర్ రేణు స్వరూప్, డైరెక్టర్ డాక్టర్ బాలసుబ్రమణియన్‌లను ఎంపిక చేశారు. బుధవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్ (ఎఫ్‌ఏబీఏ) ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ రెడ్డన్న వీరి పేర్లను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2010 నుంచి బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ రంగానికి సుదీర్ఘకాలం పాటు చేసిన సేవలకుగాను ఈ అవార్డులను అందిస్తున్నామన్నారు. డాక్టర్ రేణు స్వరూప్ కేంద్ర బయోటెక్నాలజీ శాఖ కార్యదర్శిగా పని చేశారని, ఆమె జాతీయ కార్యక్రమాల ప్రణాళిక, అమలులో కీలకపాత్ర పోషించారు.అలాగే డాక్టర్ దొర్సైరాజన్ బాలసుబ్రమణియన్ హైదరాబాద్ ఎల్‌విప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లో రీసెర్చ్ డైరెక్టర్‌గా పనిచేశారని పేర్కొన్నారు.. జీనోమ్ వ్యాలీ స్థాపనలో, రాష్ట్ర బయోటెక్నాలజీ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా, సైన్స్ అండ్ టెక్నాలజీని ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో చేసిన కృషికి గుర్తింపుగా ఎఫ్‌ఏబీఏ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఆయన్ని ఎంపిక చేశామని పేర్కొన్నారు.

రాజ్‌కుమార్ యాదవ్ స్మారక క్రికెట్ టోర్నీ ప్రారంభం

శేరిలింగంపల్లి: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలగజేస్తాయని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. రాజ్‌కుమార్ యాదవ్ స్మారక క్రికెట్ టీ–20 టోర్నమెంట్‌ను లింగంపల్లిలోని లేగల స్పోర్ట్స్ గ్రౌండ్‌లో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అరవింద్ ఆర్.కేవై ఫౌండేషన్ నిర్వాహకులను, క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్, మాజీ సర్పంచ్ లేగల వెంకట్‌రెడ్డి పటేల్, నాయకులు రాఘవేందర్‌రావు, కర్నర్ల ఎల్లేష్, అనిల్‌కుమార్ యాదవ్, రాధాకృష్ణ యాదవ్, రమేష్, సోమయ్య యాదవ్, చంద్రమౌళి, స్థానిక కాలనీల యువకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భాగ్యనగర్‌కాలనీ: చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు భాగ్యనగర్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. పోలీస్‌స్టేషన్ ఫీడర్ పరిధిలోని జలవాయు విహార్, అడ్డగుట్ట ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు... అదే విధంగా హెచ్‌ఎంటీహిల్స్ ఫీడర్ పరిధిలోని అడ్డగుట్ట ప్రాంతంలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు రెమెడీ ఆస్పత్రి క్యాథ్‌లాబ్ ప్రారంభం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీలోని రెమెడీ ఆస్పత్రిలో ఈనెల 23వ తేదీ గురువారం ఉదయం 9.30గంటలకు కార్డియాక్ క్యాథ్‌లాబ్‌ను ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ల్యాబ్‌ను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బాలాజీనగర్ కార్పొరేటర్ శిరీషబాబురావు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

నేడు జాతీయ సదస్సు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'ఖురాన్' వివరణపై జాతీయస్థాయి సదస్సును గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు అరబిక్ విభాగం హెడ్ ప్రొఫెసర్ సయ్యద్ అలీమ్ అష్రఫ్‌జైసీ బుధవారం తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని అరబిక్ విభాగం ఆధ్వర్యంలో కేరళలోని ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ తఫ్సీర్ అల్ ఖురాన్ (ఐఆర్ఐటీఏక్యూ) సహకారంతోఈ సదస్సును నిర్వహిస్తారన్నారు.

డీసీపీ పరిధిలోకి కూకట్‌పల్లి, బాలానగర్ ఏసీపీలు

కుత్బుల్లాపూర్: పోలీస్ సేవలను విస్తృత పరిచే దిశగా పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. బాలానగర్ డీసీపీ పరిధిలో కూకట్‌పల్లి, బాలానగర్ ఏసీపీలను చేర్చారు. కూకట్‌పల్లి ఏసీపీ పరిధిలో కూకట్‌పల్లి, కేబీహెచ్‌బీ, బాచుపల్లి, అల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లు ఉన్నాయి. బాలానగర్ ఏసీపీ పరిధిలో బాలానగర్, సనత్‌నగర్, జీడిమెట్ల, జగద్గిరిగుట్ట పీఎస్‌లు ఉన్నాయి. అదే విధంగా మేడ్చల్ డీసీపీ పరిధిలోని పేట్‌బషీరాబాద్ ఏసీపీ పరిధిలో పేట్‌బషీరాబాద్, శామీర్‌పేట్, అల్వాల్, జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్‌లు, మేడ్చల్ ఏసీపీ పరిధిలో మేడ్చల్, సూరారం, దుండిగల్ పోలీస్‌స్టేషన్లను చేర్చారు.

ఆర్థిక సాయం

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ మహాత్మాగాంధీ నగర్‌కు చెందిన పి.సుశీల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆదేశాల మేరకు యువ నాయకుడు దొడ్ల రామకృష్ణ గౌడ్ బుధవారం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. డీవీజీ ట్రస్ట్ ద్వారా ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో శ్రీనివాస్, యాదగిరి, దేవేందర్, వెంకటేష్, రాజు, రవి, రాంచందర్, తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని భెల్ జనరల్ ఆస్పత్రిలో బుధవారం కాంట్రాక్ట్ కార్మికుల కోసం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఈడీ వరదరాజన్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మొదటి ప్రాధాన్యతా ఓటుతో చెన్నకేశవరెడ్డిని గెలిపించాలి


పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న మేడ్చల్ నాయకులు

కూకట్‌పల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గుర్రం చెన్న కేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని పీఆర్‌టీయూటీఎస్ నాయకులు పలు పాఠశాలల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూకట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. గుర్రం చెన్న కేశవరెడ్డికి ఓటు వేయాలని ప్రతి ఉపాధ్యాయుడిని పీఆర్‌టీయూటీఎస్ నాయకులు అభ్యర్థించారు. ఆయనకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. 23వ తేదీన నాంపల్లిలోని రెడ్‌రోజ్ ప్యాలెస్‌లో జరగబోయే నామినేషన్ కార్యక్రమానికి భారీగా తరలి రావాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరించేందుకు సంఘం కృషి చేస్తోందన్నారు. అనంతరం మూసాపేట, ఆర్‌పీకాలనీ, శంషీగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కరపత్రాలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రామేశ్వర్‌గౌడ్, ఆనంద్‌రెడ్డి, నరేందర్ గౌడ్, నర్సింహులు, నరేందర్‌రెడ్డి, కృష్ణయ్య, విఠల్, చంద్ర, సిద్దయ్య, కిషన్, ప్రధానోపాధ్యాయులు యాదయ్య పాల్గొన్నారు.

కనీస సౌకర్యాల కల్పనలో విఫలం

మియాపూర్: చందానగర్ డివిజన్‌లోని అహ్మద్‌నగర్‌లో కనీస సౌకర్యాలు కల్పించడంలో ఎమ్మెల్యే, కార్పొరేటర్లు విఫలమయ్యారని బీజేపీ రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం అహ్మద్‌నగర్‌లో ఆయన పర్యటించారు. అండగా ఉండి సమస్యలు పరిష్కరిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భవిష్యత్‌లో అధికార పార్టీకి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. ఎమ్మెల్యే గాంధీ రాత్రి పర్యటనల పేరుమీద జిమ్మిక్కులు చేస్తున్నారని అభివృద్ధిని గాలికొదిలేశారని ఆయన విమర్శించారు. అహ్మద్‌నగర్‌లో కనీస సౌకర్యాలు డ్రైనేజీ, నీరు, రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించకపోతే పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యరమేష్, పాషా, రంజాన్, మోయస్, అహ్మద్‌నగర్ వాసులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించండి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పద్మావతినగర్‌లో మురుగు ఇళ్లలోకి వస్తోందని బస్తీవాసులు బుధవారం కార్పొరేటర్ సబిహా బేగం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆమె ఆ బస్తీకి వెళ్లి సమస్య ఉత్పన్నమవుతున్న సున్నం చెరువు కట్ట నుంచి కల్లు కాంపౌండ్ పక్క వీధి ప్రాంతం వరకు పరిశీలించారు. సున్నం చెరువు కట్ట వద్ద మురుగు నిలిచిపోవడంతో సీవరేజీ ఓపెన్ నాలా జామ్ అయ్యిందన్నారు. వెంటనే సీవరేజీ సిబ్బందితో మాట్లాడి శుభ్రం చేయించేందుకు తగు చర్యలు తీసుకున్నారు. డ్రైనేజీ సమస్యను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అదే విధంగా లక్ష్మీనగర్‌లో ఉనన సీవరేజీ లైన్‌ను పరిశీలించి కొత్త లైన్ వేయాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఐలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, జావిద్, తదితరులు పాల్గొన్నారు.


పద్మావతినగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

హ్యాపీ బర్త్ డే కాంతారావు సార్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. వివేకానందనగర్‌లోని చిత్తారమ్మ దేవాలయం ప్రాంగణంలో జరిగిన జన్మదిన వేడుకలకు కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున వచ్చి ఆయనతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీటీడీ ట్రస్ట్‌బోర్డు అడ్వైజరీ కమిటీ సభ్యుడు, బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు మాధవరం కాంతారావును గజమాలతో సత్కరించారు. మాధవరం కాంతారావు ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అదే విధంగా మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి కాంతారావుకు పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.


మాధవరం కాంతారావును గజమాలతో సత్కరిస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు, పన్నాల హరీష్‌రెడ్డి, నాయకులు


అభిమానులు బహూకరించిన గదతో..


పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

దళితులు ఐక్యవేదిక నూతన కమిటీ ఏర్పాటుకు తీర్మాణం

కూకట్‌పల్లి: దళితుల ఐక్యవేదికలో ప్రస్తుతం ఉన్న కమిటీ సభ్యులు పూర్తి స్థాయిలో పని చేయలేదని ఐక్య వేదిక అధ్యక్షుడు మేకల మైఖేల్, జనరల్ సెక్రటరీ యడ్ల కవిత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 2021 నుంచి 2023 వరకు ఏర్పడ్డ ఏకగ్రీవ కమిటీ ఎటువంటి కార్యక్రమాలు చేయలేదన్నారు. ముఖ్య నాయకుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలతో పాటు ఆగస్టు 15, జనవరి 26 తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించలేదని పేర్కొన్నారు.

- మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి లలితకు మాతా రమాబాయి స్మారక అవార్డు ఇచ్చి వెనక్కు తీసుకున్నారని తెలిపారు. దీంతో ఆమె కలత చెంది కార్యక్రమం నుంచి బాధపడుతూ వెళ్లిపోయారన్నారు. ఈ కమిటీకి మార్చి 2023 వరకు సమయం ఉందని తెలిపారు. ప్రస్తుత కమిటీలో ఉన్న 27 మంది మెజార్టీ సభ్యుల నిర్ణయం మేరకు పాత కమిటీని రద్దు చేసి నూతన కమిటీని ఎన్నుకుంటామని తెలిపారు. ఈ మేరకు దళితులు ఐక్యవేదిక నూతన కమిటీ తీర్మాణ ప్రవేశపెట్టామన్నారు. గతంలోనూ ఇదే పద్ధతి కొనసాగిందన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రాయదుర్గం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళే బాధ్యత బీజేపీ కార్యకర్తలదేనని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ సూచించారు. గచ్చిబౌలి డివిజన్ టెలికామ్‌నగర్‌లో పార్టీ ఆధ్వర్యంలో స్ట్రీట్ కార్నర్ సమావేశాన్ని శక్తి కేంద్ర ఇన్‌చార్జీ ధర్మగారి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పథకాలైన ఆయుష్మాన్ భారత్, ముద్ర యోజన, సుకన్య సమృద్ధి యోజన, ఇతర పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక నిర్ణయాలను కూడా ప్రజలకు వివరించాలన్నారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. వచ్చే ఎన్నికలలో శేరిలింగంపల్లిలో బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాఘవేంద్రరావు, మూల అనిల్‌గౌడ్ ,కృష్ణ ముదిరాజ్, హన్మంతునాయక్, విఠల్, వెంకటేష్, సంజీవ్, దినేష్‌యాదవ్, విశ్వనాథ్, మురళి, టెలికామ్‌నగర్‌వాసులు పాల్గొన్నారు.

1న ప్రభుత్వ భూముల వేలం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సంగారెడ్డి జిల్లా హెచ్‌ఎండీఏ పరిధిలోని మూడు ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను వేలం వేస్తున్నట్టు హెచ్‌ఎండీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగాధర్ తెలిపారు. బుధవారం రామచంద్రాపురం పట్టణంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో ముందస్తుగా బిడ్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల, అమీన్‌పూర్, జిన్నారం మండల పరిధిలోని 23 ప్లాట్లకు మార్చి 1న ఆన్‌లైన్ పద్ధతిలో వేలం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వేలంలో ప్లాట్లు దక్కించుకున్న వారికి పరిశ్రమలకు తప్ప ఎలాంటి నిర్మాణాలకైనా అనుమతులు ఇస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు రూ.1,180 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ప్రభుత్వం తెలిపిన విధంగా బిడ్ నగదు చెల్లించాలన్నారు. బిడ్ నగదు చెల్లించిన వారు మాత్రమే వేలంలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. వేలంలో ప్లాటు రానివారికి చెల్లించిన మొత్తాన్ని తిరిగి ఇస్తామన్నారు. ప్లాటు పొందిన వారు సకాలంలో నగదు చెల్లించకపోతే బిడ్ నగదు తిరిగి చెల్లింపు ఉండదని స్పష్టం చేశారు. ఈ వేలంపాటలో ఒకరి నుంచి ఐదుగురు సభ్యులు గల గ్రూపు పాల్గొనవచ్చని తెలిపారు. వేలంలో ప్లాట్ పొందినవారు వారంలో ప్లాట్ ధరలో 25 శాతం, మిగిలిన మొత్తాన్ని 90 రోజుల్లో చెల్లించవచ్చని పేర్కొన్నారు. 25 శాతం నగదు చెల్లించిన తర్వాత రుణాల కోసం బ్యాంకుకు వెళ్లేవారికి ఎన్‌ఓసీ ఇస్తామన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలో 121 గజాల నుంచి 3,630 గజాల స్థలాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అమీన్‌పూర్ మండల పరిధిలో 16, రామచంద్రాపురం మండల పరిధిలో 6, జిన్నారం మండలంలో ఒక ప్లాటుకు వేలం వేస్తామని తెలిపారు.

లోన్ యాప్ వేధింపులకు యువకుడు బలి

గచ్చిబౌలి పీఎస్‌లో కేసు నమోదు

గచ్చిబౌలి: లోన్ యాప్ వేధింపులు తాళలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. క్వార్టర్ నెంబర్ 205డి, ఉక్కునగర్, వైజాగ్ చెందిన దంపతులు కనకమహాలక్ష్మి ప్రసాద్, ఝాన్సీ రాణిల చిన్న కొడుకు ఎస్.సుదేష్(24) కొండాపూర్‌లోని శ్రీరాంగనర్, సి బ్లాక్‌లోని బాలాగౌడ్ నివాసంలో అద్దెకు ఉంటూ ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. వైజాగ్ నుంచి తల్లిదండ్రులు బుధవారం ఉస్మానియా ఆస్పత్రికి వచ్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలీసులు అప్పగించారు. 'డాడీ నన్ను క్షమించు, నీవు చెప్పినట్లు నేను ఎప్పుడు వినలేదు. మీకు తెలియకుండా ప్రైవేట్ లోన్‌యాప్‌లో అప్పు తీసుకున్నా. రెండింతలు చెల్లించమంటూ వేధిస్తున్నారు. మిమ్మల్ని నేను చూసుకోలేకపోతున్నా' అంటూ సూసైడ్ నోట్ రాశాడు. లోన్ యాప్ నుంచి తల్లిదండ్రులు, స్నేహితులకు ఫోనులు చేశారు. అందరికీ తెలియడంతో మనస్తాపానికి గురైన సుదేష్ ఉరేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.